క్లుప్తంగా

ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు


మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: నియోజకవర్గంలోని ముస్లింలకు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు బుధవారం బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, అల్లా అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని, అందరూ సుఖ సంతోషాలతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు.

ఈద్గాను శుభ్రం చేసిన ముస్లింలు
మైలవరం: బక్రీద్ పండగ పురస్కరించుకుని మైలవరంలోని ఈద్గాను ముస్లింలు బుధవారం శుభ్రం చేశారు. బక్రీద్‌కు ఈద్గాలో నమాజు చదువుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ముస్లిం మత పెద్దలు కాజా మొహిద్దిన్, సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, వైస్ ఎంపీపీ షేక్ అబ్దుల్ రహీం, పంచాయతీ కార్యదర్శి మహ్మద్ రఫీ, కో–ఆప్షన్ సభ్యులు సుభానీ తదితరులు పనులను పర్యవేక్షించారు.

ప్రకటించిన రేట్లకే కూరగాయలు విక్రయించాలి



మైలవరం: రైతు బజారులో బోర్డులో ప్రకటించిన రేట్లకే కూరగాయలు విక్రయించాలని మైలవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. మైలవరంలోని రైతు బజారును ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ తోట తిరుపతిరావుతో కలిసి తనిఖీ చేశారు. పాత చెట్లు కొమ్మలు విరగి స్టాల్స్ మీద పడుతున్నాయని, దీని వలన ఇబ్బందులు పడుతున్నామని రైతులు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన చైర్మన్ త్వరలో శాశ్వత షెడ్లు నిర్మాణం చేపట్టి, రైతు బజారు రూపు రేఖలు మార్చనున్నట్లు తెలిపారు.

క్విజ్ పోటీల్లో చిన్నంపేట విద్యార్థులు



చాట్రాయి: భారత రిజర్వ్ బ్యాంకు అఖిల భారత స్కూలు జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో మండలంలోని చిన్నంపేట హైస్కూలు విద్యార్థులు ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఏలూరులో యూనియన్ బ్యాంకు రీజినల్ మేనేజర్ ఎంజేకే మూర్తి విజేతలైన బత్తుల కేదార్‌నాథ్ గౌడ్, డి.మధుకు రూ.7,500, ప్రశంసాపత్రం అందజేశారు.

ఆత్మీయ సత్కారం



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్న సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ యూనియన్ కోశాధికారి జీకేడీ ఆంజనేయులు, వైస్ చైర్మన్ ఏపీ రంగారావు దంపతులకు యూనియన్ నేతలు, ఉద్యోగులు బుధవారం ఆత్మీయ సత్కారం చేశారు. కార్యదర్శి గద్దా సురేష్ మాట్లాడుతూ 40ఏళ్ల విధి నిర్వాహణలో తోటి ఉద్యోగులకు ఆదర్శవంతంగా నిలిచి అంకితభావంతో సంస్థ పురోభివృద్ధికి కృషి చేశారన్నారు. చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ శ్రీనివాస్, ఎంపీపీ పాలడుగు జోత్స్న, శ్రీచరణ్, భానుప్రసాద్, వైఎస్.బాబు, రాఘవేంద్ర, వెంకటేశ్వరరావు, ఎస్వీ సాంబశివరావు, బ్రాంచ్ అధ్యక్షుడు శివనాగేశ్వరరావు. వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

చాట్రాయి: వ్యవసాయ విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తెలిపారు. చాట్రాయి విద్యుత్ సబ్‌స్టేషన్లో బుధవారం విద్యుత్ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ సర్వీసులు మంజూరు చేయాలని, వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ పాల్గొన్నారు.

ముమ్మరంగా అభివృద్ధి పనులు

- పట్టణంలో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం
- ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషి

నూజివీడు: గడప గడపకు మన ప్రభుత్వం బృహత్తర కార్యక్రమం. ఇందులో భాగంగా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలోని గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరించడంతో పాటు వారి దృష్టికి వచ్చిన సమస్యలను సైతం అధికారులకు తెలిపి పరిష్కరిస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఎమ్మెల్యేలను ఇంటింటికీ పంపించిన ప్రభుత్వం లేదు. ఈ నేపథ్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలను మంజూరు చేస్తోంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోను, పట్టణంలోనూ కలిపి దాదాపు 100 రోజులకు పైగా ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పలు సచివాలయాల పరిధిలో పలు పనులు చేపట్టాలని


నూజివీడులోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో రూ.13 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు

ఎమ్మెల్యే ప్రతాప్ ఇంజినీరింగ్ అధికారులకు తెలియజేయగా, అధికారులు ఎస్టిమేషన్లు వేసి ప్రతిపాదనలు పంపగా ఆ పనులకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది.

రూ.80 లక్షలతో అభివృద్ధి పనులు
గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పట్టణంలో రూ.80 లక్షల వ్యయంతో పలు వార్డుల్లో సిమెంట్ రోడ్లు, సిమెంట్ డ్రైనేజీల నిర్మాణాలను చేపట్టారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన సచివాలయానికి ప్రభుత్వం రూ.20లక్షలు కేటాయిస్తుండటంతో వాటితో అభివృద్ధి పనులు చేయిస్తున్నారు. నూజివీడు పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు కాలనీలోని సాయిబాబు గుడి రోడ్డుకు రూ.13 లక్షలతో సిమెంట్ రోడ్డును నిర్మించగా ఇటీవల ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రారంభించారు. రూ.7 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణం, మూడో వార్డులో రూ.10లక్షలతో సిమెంట్ రోడ్డు, నాలుగో వార్డులో రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్డు, 14వ వార్డులో రూ.10లక్షలతో సిమెంట్ రోడ్డు, 17వ వార్డులో రూ.10 లక్షలతో సీసీ డ్రెయిన్, 21వ వార్డులో 5.50 లక్షలతో సీసీ డ్రెయిన్లను నిర్మించారు. 23వ వార్డులో రూ.5 లక్షలతో సీసీ రోడ్డును, మరో రూ.5 లక్షలతో సీసీ డ్రెయినేజీ నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. 18వ వార్డులో రూ.4 లక్షలతో తాగునీటి సరఫరాకు పనులు చేపట్టారు.

బురద నుంచి విముక్తి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.13 లక్షలతో ఎమ్మార్ అప్పారావు కాలనీలో సాయిబాబు గుడి వీధికి సిమెంట్ రోడ్డు నిర్మించడంతో ప్రజలకు బురదలో తిరిగే కష్టాలు తప్పాయి. ఈ కార్యక్రమం ద్వారా మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

– షేక్ మస్తాన్, ఎమ్మార్ అప్పారావు కాలనీ, నూజివీడు

సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు



రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు సంక్షేమాన్ని అమలు చేస్తూనే మరోవైపు అభివృద్ధి పనులు చేపడుతోంది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యేలందరినీ ఇంటింటికీ పంపిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదే. స్వాతంత్య్రం వచ్చిన ఇన్నేళ్లలో ఏ ప్రభుత్వం చేయని విధంగా వినూత్న సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది.

– దేవిరెడ్డి శివశేషిరెడ్డి, నూజివీడు

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

ఆర్డీఓ ప్రసన్నలక్ష్మి

తిరువూరు: జగనన్న కాలనీలలో పక్కాగృహాల నిర్మాణం వేగవంతం చేయాలని తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రసన్నలక్ష్మి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో హౌసింగ్, సచివాలయ సిబ్బందితో గృహనిర్మాణ ప్రగతిపైన, జూలై ఒకటో తేదీ నుంచి జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమంపైన సమావేశం నిర్వహించారు. పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులను ప్రోత్సహించి త్వరగా ఇల్లు నిర్మించుకునే విధంగా క్షేత్రస్థాయి సిబ్బంది తగు కృషి చేయాలని ఆర్డీఓ సూచించారు. తిరువూరు పట్టణంలోని పీటీ కొత్తూరులో జగనన్న కాలనీలో నూరుశాతం ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్, నగర పంచాయతీ అధికారులను ఆదేశించారు. జగనన్న సురక్ష కార్యక్రమ విధి విధానాలను ఆర్డీఓ వివరించారు. తిరువూరు, గంపలగూడెం, రెడ్డిగూడెం, ఏకొండూరు, విస్సన్నపేట మండలాల రెవెన్యూ, హౌసింగ్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.


తిరువూరు ఆర్డీఓ సమీక్ష

అధ్యాపకుడికి పీహెచ్‌డీ ప్రదానం

మైలవరం: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో అధ్యాపకుడు బీ సుధీర్‌కుమార్ ఆంధ్ర యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మైలవరం కళాశాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ ఆంధ్రా యూనివర్సిటీ మెకానికల్ విభాగంలో వైబ్రేషన్ అనాలిసిస్ ఆన్ యాంగ్యులర్ మౌంట్స్ విత్ డిఫెరెంట్ టైప్స్ ఆఫ్ ఇలాస్టోమర్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రదానం చేశారన్నారు. డాక్టర్ పీ రామమూర్తిరాజు ప్రొఫెసర్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్, భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన డాక్టర్ సీహెచ్ రత్నం, ప్రొఫెసర్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్, ఆంధ్ర యూనివర్సిటీ పర్యవేక్షణలో చేశారన్నారు. ఈ పరిశోధనలో సబ్ మెరైన్స్ అండ్ నావెల్ షిప్స్ యొక్క వైబ్రేషన్‌ను తగ్గించడానికి యాంగ్యులర్ మౌంట్స్ మోడల్‌ని డెవలప్ చేసినట్లు తెలిపారు. అధ్యాపకులు డీ సుధీర్‌కుమార్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు, మెకానికల్ ఇన్‌చార్జి విభాగాధిపతి డాక్టర్ పీ రవీంద్రకుమార్ అభినందించారు.


పీహెచ్‌డీ అవార్డు అందుకున్న సుధీర్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అప్పారావు

కూచిపూడి కళను ఆదరించాలి

ఇబ్రహీంపట్నం: కూచిపూడి కళ నేటితరం ఆదరించి సమాజానికి పరిచయం చేయాలని ప్రముఖ నాట్యాచార్యుడు నప్పా శివకుమార్ అన్నారు. స్థానిక ఏకాలనీ లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో గజ్జల పూజ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. గజ్జలకు పూజలు చేసి నాట్యాచారుని ఆశీర్వాదాలు పొందారు. కూచిపూడి కళకు పూర్వ వైభవం తీసుకురావల్సిన బాధ్యత అందరిపై ఉందని శివకుమార్ తెలిపారు. ఇందులో భాగంగా బాలికలు కూచిపూడి నృత్యం నేర్చుకునేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

కార్మికుల బకాయిల చెల్లింపునకు ఉత్తర్వులు

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు బకాయిల చెల్లింపునకు ఏపీ జెన్‌కో నుంచి బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. 2018–19 ఏడాదికి 10 ఏళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న కార్మికులు ఎరియర్స్ పొందేందుకు అర్హులు అవుతారు. కార్మికులకు బకాయిలు చెల్లించాలని ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజినీర్(జనరేషన్) నుంచి ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ పి.నవీన్ గౌతమ్‌కు ఉత్తర్వులు అందాయి. దీంతో రూ.40 లక్షలు నిధులు సుమారు 300 మంది కాంట్రాక్ట్ కార్మికులకు అందనున్నాయి. నిధులు మంజూరు చేయడంపై కాంట్రాక్ట్ కార్మికుల ఐక్యవేదిక అధ్యక్షుడు దేవరకొండ మల్లికార్జునరావు, ఏపీ వైఎస్సార్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు జానీ షరీఫ్ హర్షం వ్యక్తం చేశారు.

రేపు వాహనాల వేలం

నూజివీడు: పట్టణంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్టేషన్ (సెబ్)లో వివిధ ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడ్డ 11 వాహనాలకు ఈ నెల 30వ తేదీన వేలంపాట నిర్వహించనున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ టీ గోపాలకృష్ణ తెలిపారు. ఈ వాహనాల్లో పాతవి రెండు కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఐదు స్క్రాప్ ద్విచక్ర వాహనాలు ఉన్నాయని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు ఒక్కొక్క వాహనానికి రూ.5 వేలు చొప్పున ధరావతు చెల్లించాలని తెలిపారు. వేలం ధర మొత్తాన్ని వెంటనే చెల్లించాలి. దానికి 18శాతం జీఎస్టీ చెల్లించాలని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలిచిన వారు అదే రోజు ఉదయం తొమ్మిది గంటలకు ఆధార్ కార్డు, ఫోన్ నంబర్లతో స్టేషన్ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇతర వివరాలకు 94409 02462, 80745 42329లో సంప్రదించాలని పేర్కొన్నారు.

సంక్షిప్తం

పీఏసీఎస్ చైర్మన్‌కు సన్మానం
తిరువూరురూరల్: సహకార రుణ బకాయిలు నూరుశాతం వసూలు చేయడంలో కృషి చేసిన తిరువూరు మండలం మునుకుళ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ వెదురు గోపిరెడ్డిని బుధవారం మచిలీపట్నంలో కేడీసీసీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు సన్మానించారు. కేడీసీసీ బ్యాంకు పాలకవర్గ సమావేశానికి హాజరైన గోపిరెడ్డిని చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు భూక్యా రాణి, రవిశంకర్, తిరువూరు కేడీసీసీ బ్రాంచి మేనేజరు ఆజాద్, సూపర్‌వైజర్ అరుణ్ తదితరులు సత్కరించి అభినందించారు. సహకార సంఘ వేతన కార్యదర్శి వెంకటరమణను కూడా అభినందించారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన ఉండాలి
ఆగిరిపల్లి(నూజివీడు): గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బాలికలు అవగాహన కలిగి ఉండాలని ఆగిరిపల్లి ఎస్సై నంబూరి చంటిబాబు అన్నారు. స్థానిక పాఠశాల విద్యార్థులకు హైస్కూల్ ఆవరణలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. ఆడపిల్లలు ప్రతి విషయాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. బాలికల, మహిళల రక్షణ చట్టాలను తెలుసుకోవాలన్నారు. ఏఎస్ఐ శ్రీనివాస్, హైస్కూల్ హెచ్ఎం పుష్పలత పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ
ఆగిరిపల్లి(నూజివీడు): మండలంలోని సింగన్నగూడెం క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం ద్విచక్ర వాహనాలను ఆగిరిపల్లి ఎస్సై నంబూరి చంటిబాబు తనిఖీ చేసి హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాల చోదకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. హెల్మెట్‌ను ప్రతి ఒక్కరూ ట్రాఫిక్, రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలన్నారు.

స్పర్శ లేని మచ్చలను అశ్రద్ధ చేయొద్దు
తిరువూరు: శరీరంపై స్పర్శ లేని మచ్చలు ఎక్కడైనా కనిపిస్తే నిర్లక్ష్యం చేయవద్దని తిరువూరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కృపారాణి సూచించారు. తిరువూరు పట్టణంలోని పలు వార్డులలో కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు బుధవారం సర్వే నిర్వహించిన సందర్భంగా ఆమె రోగులకు పలు సూచనలిచ్చారు. చర్మంపై ఎర్రరంగు మచ్చలు, నొప్పి తెలియని గాయాలు, చర్మంపై బుడిపెల వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వాస్పత్రిలో పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహా తీసుకోవాలని కృపారాణి కోరారు. హెల్త్ సూపర్‌వైజర్ రవి, హెల్త్ విజిటర్ పద్మావతి, వార్డు హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలి
చాట్రాయి: ప్రభుత్వం అందించే ఉచిత సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తెలిపారు. మండలంలోని చిత్తపూరు–2 సచివాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగి ఏ పథకమైనా రానివారిని గుర్తించి, సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. తహసీల్దార్ విశ్వనాథరావు, ఎంపీడీఓ దుర్గాప్రసాదు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ
ముసునూరు: పేద విద్యార్థులకు ఉచితంగా నోట్ అందించడం అభినందనీయమని నూజివీడు ఫైర్ స్టేషన్ ఏఎస్సై పవన్‌బాబు అన్నారు. వేల్పుచర్లలో స్నేహదీపం ఫౌండేషన్ చైర్మన్ దేవరపల్లి రాజేష్ అధ్యక్షతన గ్రామంలోని మూడు ప్రాథమిక పాఠశాలలు, ఒక హైస్కూలుకు చెందిన 100 మంది పేద విద్యార్థులకు నోట్ పుస్తకాల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఏఎస్సై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి జయరాజు, వలంటీర్లు రాజశేఖర్, నాగరాజు, గ్రామ పెద్దలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఏ.కొండూరు: శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జనవిజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరాలని ప్రధానోపాధ్యాయులు ఆదిశేషు పేర్కొన్నారు. మండలంలోని కంభంపాడు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢనమ్మకాలపై అవిశ్రాంతంగా పోరాడుతున్న జేవీవీలో సభ్యులుగా చేరి శాస్త్రీయ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ గంగాధర్, మండల ప్రధాన కార్యదర్శి పి.లీల పాల్గొన్నారు.

పీవీ నరసింహారావుకు ఘన నివాళి

మైలవరం: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి కార్యక్రమం మైలవరంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. మైలవరం బోసు బొమ్మ సెంటర్‌లో కాంగ్రెస్ జెండా దిమ్మ వద్ద పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. బ్లాక్–1 అధ్యక్షుడు దోసపాటి గిరికుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ పార్టీ అధ్యక్షుడు దుర్గారావు, డీసీసీ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొండపల్లిలో..
కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి కార్యక్రమం కొండపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగింది. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్, పీసీసీ కార్యదర్శి పోతురాజు ఏసుదాసు, అక్కల ప్రసాద్ పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో పల్లెల్లోనూ పాలన


సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

చిక్కుళ్లగూడెం(తిరువూరు): పల్లెల్లోనూ ప్రభుత్వ పాలనను తీసుకొచ్చేందుకు సచివాలయ వ్యవస్థను ప్రారంభించినట్లు తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మండలంలోని జీకొత్తూరు శివారు చిక్కుళ్లగూడెంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో సంక్షేమ పథకాల సక్రమ అమలుకు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. అర్హత ఉన్నా సంక్షేమం అందని కుటుంబాలు వెంటనే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, గ్రామ సర్పంచ్ వెంకటరావమ్మ, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ నాడు-నేడు

ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో నాడు–నేడు పథకం కింద ఆధునిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే రక్షణనిధి తెలిపారు. మండలంలోని చిక్కుళ్లగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ నుంచి ప్రాథమిక పాఠశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఎమ్మెల్యే రక్షణనిధి సర్టిఫికెట్లు అందజేశారు. ఆంగ్లమాధ్యమంలో కిండర్ గార్టెన్ తరగతులను అంగన్‌వాడీ కేంద్రాల్లో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పట్టణాల్లోని ఇంగ్లిష్ మీడియం పాఠశాలలకు వ్యయప్రయాసలకోర్చి తమ పిల్లలను నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులకు పంపడం కంటే అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పడం మంచిదని ఆయన సూచించారు.


విద్యార్థులకు ప్రీస్కూల్ సర్టిఫికెట్ల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

ఏసీపీ రమేష్

తిరువూరు: వాహనచోదకులు ప్రమాదాల బారిన పడకుండా తగు స్వీయ రక్షణ చర్యలు తీసుకోవాలని సహాయ పోలీస్ కమిషనర్ రమేష్ సూచించారు. ఇటీవల తిరువూరు ప్రాంతంలో ద్విచక్రవాహనచోదకులు అధికసంఖ్యలో ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో వాహనదారులకు అవగాహన కల్పిస్తూ పోలీసులు హెల్మెట్లు ధరించి బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. రాజుపేట అష్టలక్ష్మీ ఆలయం సెంటర్‌లో ఈ ర్యాలీని ఏసీపీ ప్రారంభించారు. తిరువూరు డివిజన్లోని పోలీసు సిబ్బంది హెల్మెట్ ప్రాధాన్యతను వివరిస్తూ బ్యానర్లు, ప్లకార్డులతో ర్యాలీలో పాల్గొన్నారు. విజయవాడ రోడ్డులోని అయ్యప్పస్వామి గుడి వద్ద వాహనచోదకులకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఏసీపీ రోడ్డుభద్రతకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. తిరువూరు సీఐ భీమరాజు, ఎస్సైలు సతీష్, పద్మారావు, పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి

ఆగిరిపల్లి(నూజివీడు): వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు, ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తనయుడు మేకా వేణుగోపాల అప్పారావు(చంటినాయన) బుధవారం ఆగిరిపల్లి మండలంలో పర్యటించారు. దీనిలో భాగంగా తొలుత ఆగిరిపల్లిలోని మెట్ల కోనేరు వద్ద ఉన్న కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం నూజివీడు–విజయవాడ మెయిన్ రహదారి నుంచి కనసానపల్లిలోకి వెళ్లే మట్టి రోడ్డును చంటినాయన నాయకులతో కలిసి పరిశీలించారు. రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. తదుపరి ఎస్ఏపేటలోని ఇళ్ల స్థలాలను, కల్యాణ మండపం స్థలాన్ని పరిశీలించారు. చంటినాయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు మచ్చా హరిబాబు, సర్పంచ్‌లు అమ్మిశెట్టి సంజీవరావు, శ్రీను, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పలగాని నరసింహారావు ఉన్నారు.


కనసానపల్లి వెళ్లే రోడ్డును పరిశీలిస్తున్న చంటినాయన, నాయకులు

సొసైటీ చైర్మన్, సిబ్బందికి సత్కారం

గంపలగూడెం: రైతుల అవసరాలకు అనుగుణంగా రుణాలు అందజేస్తూ సకాలంలో వసూలు చేయడంలో కనుమూరు సొసైటీ సిబ్బంది, పాలకవర్గం కృషి అభినందనీయం అని గంపలగూడెం కేడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు అన్నారు. కనుమూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఈ ఏడాది నూరుశాతం రుణాలు రికవరీ కావడంపై బుధవారం బ్యాంకులో నిర్వహించిన కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు చెరుకు భాస్కర్‌రెడ్డి, సీఈఓ షేక్ ఉస్మాన్లను సన్మానించారు. బ్యాంకు మేనేజర్ కంచర్ల కనకదుర్గ, సూపర్‌వైజర్ మల్లాది ఏసోబు పాల్గొన్నారు.


సొసైటీ చైర్మన్, సీఈఓలను అభినందిస్తున్న మేనేజర్ శ్రీనివాసరావు